క్లుప్తంగా

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధ్యాయులందరూ కలిసి కట్టుగా ఉండి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. టీయూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలో సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యాభివృద్ధిపై చర్చించారు.

పనులు వేగవంతం చేయండి



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. మండలంలోని కెలిబీ, భోలాపటార్ నూతన అంగన్వాడీ భవన నిర్మాణాలు, మన ఊరు –మన బడి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న రేషన్‌షాపులను సందర్శించి లబ్ధిదారులకు ఇబ్బంది కాకుండా చూడాలని పేర్కొన్నారు. ఎంపీటీసీ సకారాం ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో ఈనెల6వ తేదీ నుంచి ప్రజాబంధు పాల్వాయి పురుషోత్తమ రావు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మల్లేష్, రాజులు తెలిపారు. మొదటి బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.7వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన క్రీడాకారులు 9010611738, 9951513166లలో సంప్రదించాలని కోరారు.

కబడ్డీ విజేత అందవెల్లి



గెలుపొందిన జట్టుతో నిర్వాహకులు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామపంచాయతీ బారెగూడలో మూడు రోజులుగా పూలే యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీలలో అందెవెల్లి జట్టు విజేతగా, బారెగూడ జట్టు రన్నర్ప్‌గా నిలిచాయి. మాలి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు నికోడె బాపురావు, గుర్లె శ్రీనివాస్, నికోడె సందీప్, సభ్యులు పాల్గొన్నారు.

‘అపరిచిత వ్యక్తుల సమాచారమివ్వండి’



మాట్లాడుతున్న భీంరావు

కెరమెరి: నూతన వ్యక్తులు, అపరిచితులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ భీంరావు అన్నారు. బుధవారం మండలంలోని హట్టి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి మొక్కలు పెంచకూడదని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. పీసీ ప్రేం తదితరులు ఉన్నారు.

ఘనంగా గోవర్‌గూడ భీమయ్యక్ పూజలు

తిర్యాణి: మండలంలోని గోవర్‌గూడ గ్రామంలో ఈనెల 1, 2 తేదీల్లో భీమయ్యక్ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం గోవర్‌గూడ ఆత్రం వంశస్తుల నియమనిష్ఠలతో, కోలాం సంస్కృతి సాంప్రదాయాలతో పూజలు నిర్వహించారు. పూజలను పురస్కరించుకుని వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కోలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావు, దేవాయిగూడ సర్పంచ్ హన్మంతరావు, ఐటీడీఏ సూపర్‌వైజర్ మడావి తిరుపతి, మాజీ సర్పంచ్ టేకం పగ్గు, ఆత్రం మారు, జంగు, దేవ్‌రావు పాల్గొన్నారు.

అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో బుధవారం పోలీసులు మీ కోసంలో భాగంగా కళాబృందం ఆధ్వర్యంలో గ్రామస్తులకు మూఢ నమ్మకాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.



‘ఆరోగ్య’ పాత్రలు





కులవృత్తులను ప్రోత్సహించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కుమ్మరులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. భారత్ ఎలక్ట్రికల్ కంపెనీ ఆధ్వర్యంలో అధునాతన యంత్రాలపై మట్టితో కుండలు, గృహోపకరణాల తయారీలో మెలకువలు నేర్పించారు. కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల వారికి కౌటాల మండలంలోని తలోడి గ్రామంలో గత 15రోజులుగా శిక్షణ ఇచ్చారు. వారు వాటర్ ఫిల్టర్లు, పూల కుండీలు, ప్లేట్లు, కుండలు, టీ కప్పులు, సాసర్లు, హుండీలు.. 20 రకాల వస్తువులను శిక్షణ కాలంలో మట్టితో తయారు చేశారు. కాగా మట్టి పాత్రలను వినియోగించడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. – కౌటాల







కులవృత్తులకు పూర్వవైభవం



శిక్షణ పొందిన కుమ్మరి కులస్తులు

కౌటాల(సిర్పూర్): కులవృత్తులకు పూర్వవైభవం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా టూరిజం అధికారి రామకృష్ణ అన్నారు. కౌటాల మండలం తలోడిలో కుమ్మరి కులస్తులకు రెండో విడత శిక్షణ బుధవారంతో ముగిసింది. శిక్షణలో భాగంగా తయారుచేసిన మట్టి పాత్రలు, గృహోపకరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కుమ్మరులకు 15 రోజుల పాటు శిక్షణ అందించినట్లు తెలిపారు. భారత్ ఎలక్ట్రికల్ కంపెనీ ఆధ్వర్యంలో అధునాతన యంత్రాలపై మట్టితో కుండలు, గృహోపకరణాల తయారీలో మెలకువలు నేర్పించమన్నారు. రెండో విడత కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల్లోని 45 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ రెడ్డి, ఏపీఎం వెంకటరమణరెడ్డి, కుమ్మరుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షులు అశోక్, నారాయణ, సంతోష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఐసీడీఎస్, ఎండీఎంఎస్, ఎన్‌హెచ్‌ఎం, తదితర స్కీంల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, 45వ ఐఎల్‌సీ సిఫారసుల ప్రకారం కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి త్రివేణి, నాయకులు టి.వనిత, శ్రీనివాస్, సువర్ణ, ఇందిర, అంజలి తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలు పటిష్టం చేయాలి



మాట్లాడుతున్న కేసరి ఆంజనేయులు గౌడ్

ఆసిఫాబాద్: శక్తి బూత్ కమిటీలను పటిష్టం చేసేందుకు శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలన్నారు.ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో వర్చువల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రబారి రావుల రాజేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లులక్ష్మి, సెన్సార్ బోర్డు సభ్యులు బోనగిరి సతీశ్‌బాబు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు వందన, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీఎల్‌ఎం మేళా



బోధనోపకరణాలు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం టీఎల్‌ఎం (టీచర్ లెర్నింగ్ మెటీరియల్) మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు తాము తయారు చేసిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. మండల విద్యాధికారి సోమయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, ఎంపీడీవో మహేందర్, ఎస్సై విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు దేవాజీ, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి టీఎల్‌ఎం మేళా బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, తహసీల్దార్ అనంతరాజు, ఎస్సై చుంచు రమేష్, ఎంఈవో వెంకటేశ్వర స్వామి పాల్గొని టీఎల్‌ఎం ప్రదర్శనను ప్రారంభించారు. టీఎల్‌ఎం పరికరాలను ఉత్తమంగా తయారు చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాస్, నాయకపుగూడ సర్పంచ్ మధుకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4. 30గంటల టీఎల్‌ఎం మేళా నిర్వహించనున్నట్లు ఎంఈవో సోమయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

జాతర దుకాణాల వేలంతో రూ.8.79 లక్షల ఆదాయం

రెబ్బెన(ఆసిఫాబాద్): మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న జాతర సందర్భంగా కొబ్బరికాయల విక్రయం, తైబజార్ నిర్వహణ కోసం బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వేలం ద్వారా ఆలయానికి రూ.8,79,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం చారి తెలిపారు. తైబజార్ నిర్వహణ కోసం రూ.7,03,000, కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయం కోసం రూ.1,76,500లకు వేలం పాడి దక్కించుకున్నారని పేర్కొన్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి తైబజార్, కొబ్బరికాయల విక్రయాలకు నిర్వహించిన వేలం ద్వారా రూ.90,500 అదనపు ఆదాయం సమకూరిందన్నారు.

అయితే ప్రసాదం, పార్కింగ్ నిర్వహణలకు సైతం వేలం నిర్వహించినా గతేడాది కంటే తక్కువగా వేలం పాడిన కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీన తిరిగి ప్రసాదాల విక్రయం, పార్కింగ్ నిర్వహణలకు వేలం నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వేలం పర్యవేక్షణాధికారి రవి, ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మహాపూజ’ విజయవంతం చేయండి

కెరమెరి: ఈ నెల 6న మండలంలోని జంగుబాయి దేవస్థానంలో ‘మహాపూజ’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మరప బాజీరావు, చైర్మన్ కొడప జాకు, ప్రధాన కార్యదర్శి సలాం శ్యాంరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పోస్టర్లను విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజలు జరుగుతాయని, అనంతరం ప్రత్యేక దర్బార్ ఏర్పాటు చేస్తున్నట్లే పేర్కొన్నారు. బీర్‌శావ్, గోవింద్‌రావు, తదితరులు ఉన్నారు.

‘ఆర్టీసీ ప్రయాణం సురక్షితం’

చింతలమానెపల్లి: ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలపై మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బుధవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ ఆర్టీసీ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలపై కళాప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని సభ్యులు వివరించారు. కళాజాత బృందం సభ్యులు సాంబయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి): మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ లోపు మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని మాన్యువల్ కాపీలతో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలి



ప్రజలకు సూచనలు చేస్తున్న సురేందర్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. బుధవారం మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఆయన సందర్శించి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి మరుగుదొడ్డితో పాటు ఇంకుడు గుంత ఉండాలని, ఇంకుడు గుంతలతో భూగర్భజల మట్టం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, సర్పంచ్ రాందాస్, పంచాయతీ కార్యదర్శి దేవరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

రెబ్బెన: వ్యక్తిగత మరుగుదొడ్ల వద్ద ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా రెండు మరగుదొడ్డి గుంతలు తవ్వుకోవాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. బుధవారం మండలంలోని కొండపల్లిలో పర్యటించిన ఆయన వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మురుగు నీటి నిర్వహణ, డ్రెయినేజీ వద్ద ఇంకుడు గుంత నిర్మాణంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ వడాయి శాంత, ఎస్‌బీఎస్ మేనేజర్ ఫణికుమార్, ఏపీవో బుచ్చన్న, పంచాయతీ కార్యదర్శి అజార్ అలీ, టీఏ ప్రవీణ్, ఈసీ పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి



జెండా ఆవిష్కరిస్తున్న రజీహైదర్

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీల రిజర్వేషన్లు పెంచాలని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రజీహైదర్ డిమాండ్ చేశారు. మహాజన సోషలిస్టు పార్టీ ఆవిర్భావ వేడుకలను స్థానిక రాజీవ్ గాంధీ చౌరస్తాలో బుధవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. జాతీయ నాయకులు కేశవరావు మాదిగ, జిల్లా నాయకులు షాబాజ్ హైదర్, శ్రీనివాస్, బండమూర్తి బ్రహ్మయ్య, అంజయ్య, సజ్జాద్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ విష్ణు

చింతలమానెపల్లి: పీఆర్టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం చింతలమానెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.దేవాజీ మాట్లాడుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. మండలాధ్యక్షుడు కుర్మదాస్, కార్యదర్శి రవి, ఎంఈవో సోమయ్య, ఎంపీడీవో మహేందర్, ఎస్సై విజయ్, పాల్గొన్నారు.

మాలమహానాడు క్యాలెండర్ ఆవిష్కరణ

బెజ్జూర్: తెలంగాణ మాలమహానాడు నూతన సంవత్సర క్యాలెండర్‌ను బెజ్జూర్ హెడ్‌కానిస్టేబుల్ విష్ణు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దుంద్రా శ్రీనివాస్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, పెంచికల్‌పేట్ మండల అధ్యక్షుడు హనుమంతు, బెజ్జూరు మండల అధ్యక్షుడు రవి, పెంచికల్‌పేట్ మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ అంజన్న, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలి



పాఠశాలను సందర్శిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

రెబ్బెన: జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించిన రెబ్బెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం రవీందర్ కోరారు. బుధవారం పాఠశాలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రహరీ లేకపోవటం పాఠశాల స్థలం కబ్జాకు గురవుతోందన్నారు. పాఠశాల స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయి, మండల కార్యదర్శి బాలు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



జయంతి నిర్వహిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఎంఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవ్‌రావ్ మాట్లాడుతూ అంధుడైన లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం లిపిని కనిపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపాడని కొనియాడారు.

ఎంఎస్పీ ఆవిర్భావ దినోత్సవం

మహాజన సోషలిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం చౌక్ వద్ద పార్టీ నాయకులు జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, మల్లేష్, సంతోష్, రాజు, రాంచందర్, బండమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కనకన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం సీనియర్ నాయకుడు బావాండ్లపల్లి కనకన్న ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ చౌరస్తాలో బుధవారం నిర్వహించిన కనకన్న 29వ వర్ధంతి సభకు హాజరయ్యారు. మొదటగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కామ్రేడ్ కనకన్న చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచార నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, డిగ్రీ నుంచే సమాచార నైపుణ్యాలను పెంపొందించుకోవాలని టాస్క్ ప్రాజెక్టు మేనేజర్ బాలు ప్రవరాఖ్య అన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రైవేట్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటికి తగిన నైపుణ్యాలు విద్యార్థులు నేర్చుకోవాలని పేర్కొన్నారు. సాధారణ డిగ్రీతోనే సాఫ్ట్‌వేర్ కొలువులు సాధించడానికి టాస్క్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కెరమెరి: జైనూర్ మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో కెరమెరి మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు డివిజన్ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం. పోచయ్య, జే. బద్రు ప్రతిభ కనబర్చారు. విజేతలకు ఏటీడీఏ చంద్రమోహన్ ప్రశంసాపత్రాలతో పాటు మెమొంటోలు అందించారు. హెచ్‌ఎం వసంత్‌రావు, ఉల్లాస్, మీనాక్షి ఉన్నారు.

దివ్యాంగులకు బస్సుపాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లు అందజేస్తున్న సిబ్బంది

బెజ్జూర్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు దివ్యాంగులకు 50శాతం సబ్సిడీపై బస్‌పాస్‌లను అందజేస్తున్నట్లు ఆర్టీసీ ఉద్యోగి లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బస్‌పాస్ మేళా నిర్వహించారు. మొత్తం 52 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో వీరికి బస్‌పాస్‌లు సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. అర్హులు ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బస్‌పాస్ పంపిణీ కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.